సాక్షి
అనకాపల్లి
బుధవారం । 14 । ఫిబ్రవరి । 2024

ఆడుదాం ఆంధ్రా థీమ్ సాంగ్‌కు నృత్యం చేస్తున్న క్రీడాకారులు



అభివాదం చేస్తున్న సీఎం జగన్

వేడుక అదుర్స్

ఉల్లాసంగా.. ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్రా'

డాక్టర్ వైఎస్సార్ క్రికెట్ స్టేడియంలో ముగిసిన క్రీడా సంబరాలు

క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌ను వీక్షించిన ముఖ్యమంత్రి జగన్

విజేతలకు బహుమతుల ప్రదానం



బాణసంచా, లేజర్ షో వెలుగుల మధ్య వైఎస్సార్ స్టేడియం



క్రీడాకారులతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

సాగతీరం ఉరకలెత్తింది. క్రీడాలోకం మురిసిపోయింది. ఆడుదాం ఆంధ్రా పేరుతో క్రీడలు నిర్వహించడమే కాకుండా ముగింపు వేడుకలకు స్వయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హాజరుకావడంతో క్రీడాకారుల ఆనందానికి అవధులు లేవు. క్రీడాకారులకు స్ఫూర్తినింపుతూ ప్రసంగించారు. క్రీడా ఆణిముత్యాలకు మన ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అధికారులు తొలుత క్రికెట్ ఫైనల్ విజేత జట్టు కెప్టెన్, వైస్ కెప్టెన్లను మాత్రమే వేదిక పైకి రావాలని ఆహ్వానించారు. అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. క్రికెట్ టీమ్ మొత్తం వేదికపైకి రావాలంటూ స్వయంగా ఆయనే చేతులు ఊపి పైకి రావాలని చెప్పడంతో.. క్రికెట్ టీమ్ సభ్యులంతా ఉత్సాహంతో స్టేడియంలో పరుగులు పెట్టారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా బహుమతులు అందుకోవడం జీవితాంతం గుర్తుంచుకుంటామని క్రీడాకారులు ఆనందం వ్యక్తం చేశారు.

సాక్షి, విశాఖపట్నం/విశాఖ స్పోర్ట్స్ : ఉల్లాసంగా.. ఉత్సాహంగా..'ఆడుదాం ఆంధ్రా' క్రీడా సంబరాలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన క్రీడా పోటీలు మంగళవారం విశాఖ వైఎస్సార్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో అంగరంగ వైభవంగా ముగిశాయి. మట్టిలో మాణిక్యాలను ఒడిసిపట్టే మహాయజ్ఞం విశాఖ సాగర తీరంలో ఉవ్వెత్తున ఎగిసిపడింది. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి క్రీడాకారులు విశాఖలో ఐదురోజుల పాటు ఉత్సాహంగా గడిపారు. గత ఏడాది డిసెంబర్ 26న విజయవాడలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 'ఆడుదాం ఆంధ్రా' పోటీలకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. క్రికెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్ క్రీడల్లో యువతీయువకులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రామ స్థాయి నుంచి యువతలో క్రీడా స్ఫూర్తిని నింపుతూ, ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తలపెట్టిన ఈ ప్రతిష్టాత్మక వేడుకలు ఘనంగా ముగిశాయి.



నృత్యం చేస్తున్న కళాకారులు



కార్యక్రమంలో పాల్గొన్న సీఎం జగన్, చిత్రంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రులు బొత్స సత్యనారాయణ, విడదల రజిని, రోజా, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, బొత్స ఝాన్సీలక్ష్మి

యువతలో స్ఫూర్తినింపిన క్రీడలు

విశాఖలో జరిగిన 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలు యువతలో క్రీడలపై ఆసక్తిని పెంచాయి. చదువే కాదు క్రీడలు సైతం భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తాయన్న భరోసాను యువతకు కల్పించాయి. వైఎస్సార్ స్టేడియంలో మంగళవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ.. ఆరోగ్యం వ్యాయామాల పట్ల ప్రజలకు అవగాహన పెరగాలన్నది ఆడుదాం ఆంధ్రా పోటీల మొదటి ఉద్దేశమని చెప్పారు. ఇక్కడి విజేతలను జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడా సంస్థలు ఎంపిక చేసిన విషయం ముఖ్యమంత్రి ప్రకటించడంతో యువతలో ఉత్సాహం ఉరకలెత్తింది.



స్టేడియంలో ఉత్సాహంగా అభిమానులు

కిటకిటలాడిన స్టేడియం

ఆడుదాం ఆంధ్రా ఫైనల్ క్రికెట్ మ్యాచ్‌కు వేలాది మంది యువత హాజరై మ్యాచ్ తిలకించారు. అంతర్జాతీయ స్థాయి క్రికెట్ మ్యాచ్‌కు వచ్చినట్లుగా విశాఖ నగర యువతతో పాటు సమీప జిల్లాల నుంచి కూడా పెద్ద ఎత్తున జనం హాజరయ్యారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చినప్పటి నుంచి యువత కేరింతలు, ఈలలతో స్టేడియం మార్మోగింది. ముఖ్యమంత్రి దాదాపు అరగంట పాటు ఫైనల్ క్రికెట్ మ్యాచ్‌ను వీక్షించారు.

హోరెత్తిన మైదానం

ఆడుదాం ఆంధ్రా ముగింపు వేడుకలతో వైఎస్సార్ స్టేడియం హోరెత్తింది. ఒక పక్క చిన్నారుల నృత్యాలు.. మరో వైపు లేజర్ షో, ఫ్లాష్‌లైట్లతో అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. తొలుత స్టేడియంలో దుబాయ్ జట్టు ఫ్లాష్ డ్యాన్స్ చక్ దే ఇండియా అంటూ అలరించగా కూచిపూడి నృత్యకారిణులు ఓం నమఃశివాయ అంటూ చేసిన ప్రదర్శన అలరించింది. క్రీడాకారులు జయహో అంటూ చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. మూడు కళారూపాలతో 'ఆడుదాం ఆంధ్రా' థీమ్ సాంగ్‌కు చేసిన నృత్యం అబ్బురపరిచింది. ఒక్కసారిగా స్టేడియంలో లైట్స్‌ఆఫ్ అయ్యాయి. అంతే డ్రోన్స్ ప్రత్యక్షమయ్యాయి.



అనంతరం వియ్ ఆర్ రాకింగ్ అంటూ ఫ్లాష్ ఫోతో స్టేడియం మిరమిట్లు గొలిపే కాంతులీనింది. స్టేడియం మొత్తం లైట్లతో లయబద్ధంగా నాట్యమాడింది. రెండు నిమిషాలపాటు బాణసంచాతో స్టేడియం దద్దరిల్లింది.

పటిష్ట బందోబస్తు

క్రీడోత్సవాలకు భారీగా క్రీడాకారులు, జనం తరలివచ్చినా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. స్థానిక సీఐ వై.రామకృష్ణ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కారు షెడ్ కూడలిలో ట్రాఫిక్ సమస్యలు నివారించడానికి సిబ్బందికి విధులు అప్పగించారు. పీఎంపాలెం-కొమ్మాది-వుడా రోడ్డు -చంద్రంపాలెంకు వెళ్లే వాహనాలను క్రమబద్ధీకరించారు.



స్టేడియంలో క్రికెట్ ఫైనల్ పోరు

వేడుకల్లో పాల్గొన్న వారు వీరే..

డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి ఆర్‌కే రోజా, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, రాష్ట్ర ఇన్‌ఛార్జి మంత్రి విడదల రజనీ, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దారెడ్డి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంట్ ఇన్‌ఛార్జి బొత్స ఝాన్సీ, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, జిల్లా పార్టీ అధ్యక్షులు కోలా గురువులు, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వాసుపల్లి గణేష్‌కుమార్, తిప్పలనాగిరెడ్డి, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, కె.భాగ్యలక్ష్మి, కంబాల జోగులు, నెడ్‌క్యాప్ చైర్మన్, విశాఖ ఉత్తర సమన్వయకర్త కె.కె రాజు,గాజువాక ఇన్‌చార్జి ఉరుకూటి చందు తదితరులు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌కు ఘన స్వాగతం

సాక్షి, విశాఖపట్నం: ఆడుదాం ఆంధ్రా రాష్ట్ర స్థాయి క్రీడా టోర్నమెంట్ ముగింపు వేడుకలకు విశాఖకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. మంగళవారం సాయంత్రం 5.15 గంటలకు విమానంలో ఇక్కడి విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు సీఎంకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలునాయుడు, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, భీశెట్టి వెంకట సత్యవతి, గొడ్డెటి మాధవి, నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ జె. సుభద్ర, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్నీ తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం 5.27 గంటలకు విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి సాయంత్రం 5.35 గంటలకు మధురవాడ ఐటీ హిల్ నెం.3 వద్ద ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు ముఖ్యమంత్రి చేరుకున్నారు.





సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి

హెలిప్యాడ్ వద్ద స్వాగతం పలికిన ప్రజాప్రతినిధులు

హెలిప్యాడ్‌కు చేరుకున్న సీఎంకు వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు పెట్ల ఉమా శంకర్ గణేష్, ఇతర ప్రజాప్రతినిధులు పుష్పగుచ్ఛాలను అందజేసి ఘనంగా స్వాగతం పలికారు.

ముఖ్యమంత్రికి ఆత్మీయ వీడ్కోలు

'ఆడుదాం - ఆంధ్రా' రాష్ట్ర స్థాయి క్రీడా వేడుకలు ముగించుకుని తిరుగు ప్రయాణంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి రోడ్డు మార్గం ద్వారా విమానాశ్రయం చేరుకున్నారు. అక్కడ నుంచి ప్రత్యేక విమానంలో రాత్రి 8.35 గంటలకు విజయవాడకు బయలుదేరారు. జిల్లా కలెక్టర్ డా.ఎ. మల్లికార్జున, సీపీ రవిశంకర్, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ ఆయనకు వీడ్కోలు పలికారు.

ఎన్నికలకు ముందస్తు భద్రత చర్యలు : డీఐజీ

ఆరిలోవ (విశాఖ): సాధారణ ఎన్నికలు జరగనున్న సందర్భంగా విశాఖ రేంజ్‌లో ముందస్తు పోలీస్ చర్యలు చేపట్టాలని డీఐజీ విశాల్ గున్నీ పోలీస్ అధికారులకు సూచించారు. పార్వతీపురం మన్యం, అల్లూరి, అనకాపల్లి జిల్లాల అదనపు ఎస్పీలు, ఏఎస్పీలు మంగళవారం డీఐజీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ చెక్‌పోస్టుల వద్ద విస్తృత తనిఖీలు చేయాలన్నారు. సమస్యాత్మకమైన ప్రాంతాల్లో సైతం ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. అనకాపల్లి అదనపు ఎస్పీ పి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీల బదిలీలు : అనకాపల్లి స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా బాధ్యతలు నిర్వహిస్తున్న జి.సుభద్రమ్మను ఇంటెలిజన్స్ డీఎస్పీగా బదిలీ చేస్తూ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం కాకినాడ 3 టఛీ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్‌గా, రాజమండ్రి స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న బి.అప్పారావును అనకాపల్లి స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా నియమించారు.

న్యూస్‌రీల్

జేఈఈ మెయిన్స్‌లో సత్తా

- 99.821 పాయింట్స్ సాధించిన గవర్ల అనకాపల్లి విద్యార్థి



శర్వన్‌నాయుడితో తల్లిదండ్రులు కిరణ్‌కుమార్, నాగపార్వతి

మునగపాక: కృషి, పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదంటూ నిరూపించాడు మునగపాక మండలం గవర్ల అనకాపల్లికి చెందిన విద్యార్థి శర్వన్‌నాయుడు. ఒకటో తరగతి నుంచి చదువులో ముందుండి మంచి మార్కులు సాధిస్తూ వచ్చిన ఈ విద్యార్థి సోమవారం విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో మెరుగైన పాయింట్స్ సాధించాడు. దొడ్డి కిరణ్‌కుమార్, నాగపార్వతీదేవీ దంపతుల కుమారుడైన శర్వన్‌నాయుడు చిన్నతనం నుంచి చదువులో రాణిస్తున్నాడు. గత నెల 29న జేఈఈ మెయిన్స్ పరీక్ష రాశాడు. అందులో ఓవరాల్‌గా 99.8216742 పాయింట్స్ (ఎన్‌టీఏ స్కోర్) సాధించాడు. ఐఐటీలో సీటు సాధించడమే తన లక్ష్యమని శర్వన్‌నాయుడు తెలిపాడు. అతనిని తల్లిదండ్రులతోపాటు తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి, కోటేశ్వరరావు దంపతులు, గ్రామస్తులు అభినందించారు.

ఫైనల్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు



మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, చిత్రంలో డీఈవో వెంకటలక్ష్మమ్మ తదితరులు

- టెన్త్, ఇంటర్, ఏపీపీఎస్సీ పరీక్ష కేంద్రాల్లో లోటుపాట్లు లేకుండా చూడండి
- సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

తుమ్మపాల: త్వరలో జరగనున్న పదో తరగతి, ఇంటర్మీడియట్, ఓపెన్ స్కూల్, ఏపీపీఎస్సీ పరీక్షల నిర్వహణకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ, విద్యా, పోలీస్, వైద్య శాఖల అధికారులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి 18 నుంచి 27 వరకు టెన్త్, మార్చి 1 నుంచి 20 వరకు ఇంటర్ పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, పారిశుధ్యం వంటి మౌలిక వసతులన్నీ పూర్తిగా ఉండాలన్నారు. వైద్య శిబిరాలు, ఓఆర్ఎస్, గ్లూకోజ్ అందుబాటులో ఉండాలని తెలిపారు. ప్రశ్నాపత్రాలు, ఆన్సర్ షీట్లను కట్టుదిట్టమైన భద్రతలో ఉంచాలన్నారు.

టెన్త్ పరీక్షలకు 108 కేంద్రాలు

డీఈవో వెంకట లక్ష్మమ్మ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలకు జిల్లాలో 108 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో 397 పాఠశాలలకు చెందిన 21,259 మంది రెగ్యులర్ విద్యార్థులు, 2,324 మంది ప్రైవేటు విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు.

38 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు

డీవీఈవో బి.సుజాత మాట్లాడుతూ ఇంటర్ పరీక్షలకు జిల్లాలో 38 పరీక్షా కేంద్రాలు, 14 పోలీస్ స్టేషన్లలో ప్రశ్నాపత్రాల స్ట్రాంగ్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇంటర్ ఫస్టియర్ పరీక్షలకు 13,323 మంది విద్యార్థులు హాజరు కానుండగా వారిలో 1,074 మంది జనరల్, 2,619 మంది ఒకేషనల్ విద్యార్థులు ఉన్నారన్నారు. సెకండియర్ పరీక్షలకు 15,298 మంది హాజరవుతుండగా.. వారిలో 1,278 మంది జనరల్, ఒకేషనల్ విద్యార్థులు ఉన్నారని చెప్పారు. అలాగే ఏపీ ఓపెన్ స్కూల్ ఎస్ఎస్‌సీ పరీక్షలు మార్చి 18 నుంచి 27 వరకు ఐదు కేంద్రాల్లో జరుగుతాయని, 788 మంది హాజరవుతారని తెలిపారు. ఓపెన్ ఇంటర్ పరీక్షలు 11 కేంద్రాల్లో జరుగుతాయని, 2,205 మంది హాజరవుతారన్నారు. మార్చి 30 నుంచి ఏప్రిల్ 3 వరకు ఐదు కేంద్రాల్లో ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయని, 991 మంది హాజరవుతున్నట్లు చెప్పారు. డీఆర్‌వో బి.దయానిధి, అనకాపల్లి డీఎస్పీ సుబ్బరాజు, ఉపవిద్యాశాఖ అధికారి రవిబాబు, డీఈసీ సభ్యులు శ్రీనివాసరావు, పి.శిరీషరాణి, మూర్తి, మోహన్‌రావు, పోస్టల్ సూపరింటెండెంట్ పండా, ఆర్టీసీ మేనేజర్ నారాయణ, ఎస్‌టీవో రాజేష్ పాల్గొన్నారు.

నేవీ నిర్వాసితులకు జీవన భృతి

- ఒక్కొక్కరికీ రూ.1.30 లక్షలు
- సీఎం జగన్ మేలు మరవలేం
- ఎమ్మెల్యే రమణమూర్తిరాజు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

రాంబిల్లి: నేవీ నిర్వాసితులకు జీవన భృతి సాధనలో సీఎం వైఎస్ జగన్ చేసిన మేలు మరువరానిదని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు అన్నారు. నేవీ నిర్వాసితులు మంగళవారం వాడనర్సాపురంలో అభినందన సభ నిర్వహించి ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 155 రోజులపాటు నేవీ నిర్వాసితులు ధర్నా చేశారని, నిర్వాసితుల వైపు న్యాయం ఉండడంతో తాను వారి పక్షాన నిలిచానన్నారు. ఇదే విషయాన్ని తాను సీఎంకు చెప్పానన్నారు. దీంతో ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి, కలెక్టర్, ఇతర అధికారులకు అనుకూల వాతావరణం కల్పించడం వల్లే అన్ని రోజులు ధర్నా చేసి, కేంద్రం దృష్టికి సమస్యను తీసుకువెళ్లగలిగామన్నారు. వాడనర్సాపురం, కొత్తపట్నం గ్రామాలకు చెందిన 2211 మందికి రూ. 28 కోట్ల74 లక్షల 30 వేల సొమ్మును నేరుగా వారి ఖాతాలకే జమ చేయడం జరుగుతుందన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ఉప్పలపాటి సుకుమారవర్మ (తేజ), ఎంపీపీ జి.శిరీష, జెడ్పీటీసీ ధూళి నాగరాజు, సర్పంచ్ కారె రామారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జేఈఈ మెయిన్స్‌లో శశి విద్యార్థుల ప్రతిభ





ఎస్.దిలీప్ వెంకట సతీష్ | జె.వెంకట హర్షవర్ధన్ | నాగసాయి నారాయణ



ఎస్.అనిల్ వర్మ

తగరపువలస: ఇటీవల నిర్వహించిన జేఈఈ మెయిన్స్ పరీక్షా ఫలితాలలో తమ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ తెలిపారు. ఎస్.దిలీప్ వెంకట సతీష్ 99.94, జె.వెంకట హర్షవర్ధన్ 99.76, సిహెచ్ నాగసాయి నారాయణ 99.74, ఎస్.అనిల్‌వర్మ 99.61, జి.దుర్గాప్రసాద్ 99.46, జి.జైదీప్, సీహెచ్ శ్యామ్ సుందర్ 99.43, పి.కుశ్వంత్‌సాయిరెడ్డి 99.26, జి.పృథ్వీతేజ 99.14 పర్సంటైల్ సాధించారన్నారు. 22 మంది విద్యార్థులు 98కు పైగా, 36 మంది 97కు పైగా, 45 మంది 96కు పైగా, 53 మంది 95కు పైగా, 105 మంది 90కు పైగా పర్సంటైల్ సాధించినట్టు తెలిపారు. వీరిని వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, అకడమిక్ డైరెక్టర్ మేకా క్రాంతిసుధ, అధ్యాపక బృందం అభినందించింది.

ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా త్రినాథ్



బుచ్చెయ్యపేట: ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తమరాన త్రినాథ్ ఎన్నికయ్యాడు. విజయవాడలో జరిగిన ఎన్నికల్లో బుచ్చెయ్యపేటకు చెందిన ఆయన్ను రెండోసారి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కమిటీ సభ్యులు ఎన్నుకున్నారు. గతంలో ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడిగా, బుచ్చెయ్యపేట మండలాధ్యక్షుడిగా త్రినాథ్ పనిచేశారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

రావాలమ్మ ఆలయాభివృద్ధికి రూ.లక్ష విరాళం

కె.కోటపాడు: స్థానిక రావాలమ్మ ఆలయాభివృద్ధికి షిర్డీసాయి బాబా మందిర అభివృద్ధి కమిటీ చైర్మన్ వేగి రామారావు లక్ష రూపాయలు విరాళంగా అందించారు. మంగళవారం ఆయన కె.కోటపాడులో ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు బండారు సూర్యనారాయణపాత్రుడు, అక్కన్నపాత్రుడు, నారాయణపాత్రుడులకు ఈ మొత్తాన్ని అందించారు.



- పెద్దల్ని ఎదిరించి.. ఒప్పించి నిలిచిన ప్రేమ విజేతలు
- అన్యోన్యంగా సాగుతున్న దాంపత్యం
- ప్రేమికుల దినోత్సవం నేడు

నువ్వుంటే నా జతగా.. నేనుంటా ఊపిరిగా..

ప్రేమ అనిర్వచనీయమైనది.. అది వెలకట్టలేని సంపద. నిస్వార్థమైన, నిజాయతీతో కూడిన ప్రేమ ఎంతో పవిత్రమైనది, శక్తివంతమైనది కూడా.. ఈ ప్రపంచాన్నే ముందుకు నడిపించే భావోద్వేగమైనది ప్రేమ.. ఏ బంధమైనా వికసించాలన్నా.. నిలవాలన్నా ప్రేమ ఒక్కటే మార్గం.

ఓ సినిమా డైలాగ్.. వీలైతే ప్రేమిద్దాం డూడ్, పోయేదేముంది.. మహా అయితే తిరిగి ప్రేమిస్తారు.

ప్రేమ ఇద్దరు వ్యక్తుల మధ్య అయి ఉండవచ్చు.. లేదా కుటుంబం, సమాజం మీద కావచ్చు. నిజమైన ప్రేమ.. ధనంతోనూ బలంతోనూ దక్కించుకునేది కాదు. నిజంగా ప్రేమించడం ద్వారానే దాన్ని పొందగలం.

జిల్లాలో చాలా మంది తమ నిజమైన ప్రేమతో జీవితాన్ని ఆనందమయం చేసుకున్నారు. ప్రేమను గెలిపించి.. పెళ్లి బంధంతో ఏకమై ప్రేమానుభూతులను ఆస్వాదిస్తున్నారు. నువ్వుంటే నా జతగా.. నేనుంటా ఊపిరిగా అంటూ.. దేహాలు వేరైనా మన ప్రేమ ఒక్కటే అంటూ.. ముందుకు సాగుతున్నారు. నేడు ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ప్రేమించుకుని పెద్దలను ఒప్పించి, ఎదిరించి వివాహ బంధంతో ఒక్కటైన కొంతమంది ప్రేమానుభూతులు వారి మాటల్లో...

నమ్మకమైన బంధానికి ప్రతిరూపం



యలమంచిలి రాంనగర్‌కు చెందిన ఆడారి సుప్రియాదేవి కాకినాడ జేఎన్‌టీయూలో బీటెక్ (కెమికల్) చదివే రోజుల్లో కాకినాడకు చెందిన సహచర విద్యార్థి ఆదిత్య షణ్ముఖ్‌తో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. స్వతహాగా తరగతిలో మెరిట్ విద్యార్థులు కావడం, సందేహాల నివృత్తికోసం ప్రొఫెసర్ల వద్దకు వెళ్లడం, పోటీపడి చదవడంతో ఒకరంటే ఒకరికి ఇష్టం మరింత ఎక్కువైంది. కులాలు వేరైనా వివాహం చేసుకోవాలనుకుని పెద్దలకు ప్రేమ విషయం తెలపగా, ఆదిత్య షణ్ముఖ్ కుటుంబీకులు మొదట అంగీకరించలేదు. 2019 నుంచి ఉద్యోగాలు చేస్తూనే సుప్రియాదేవి, ఆదిత్య షణ్ముఖ్ పట్టుబట్టి ఇంట్లో పెద్దల్ని ఒప్పించారు. నాలుగేళ్ల నిరీక్షణ తర్వాత వీరిద్దరికీ వివాహం చేయడానికి అంగీకరించారు. సుప్రియాదేవి తల్లి రామలక్ష్మి పట్టణంలోని కొత్తపేట హైస్కూల్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయినిగా, తండ్రి రమణ సామాజిక కార్యకర్తగా పనిచేస్తున్నారు. గతేడాది కుమార్తె సుప్రియాదేవి, ఆదిత్య షణ్ముఖ్‌లకు సంప్రదాయబద్ధంగా వివాహం జరిపించారు. ప్రస్తుతం ఇద్దరూ బంగ్లాదేశ్ రాజధాని ఢాకా సమీపంలో ఓ ఎంఎన్‌సీలో ఇంజినీర్లుగా పనిచేస్తున్నారు. కళాశాల రోజుల్లో ప్రేమలో పడిన తొలినాళ్లలో ఉన్నప్పటికంటే ఇప్పుడు మరింత ప్రేమగా ఉంటున్నామని, ఇది మా గొప్ప కాదని తమ మనసుల్ని ఎరిగిన పెద్దల ఔదార్యంతో చాలా సంతోషంగా ఉన్నామని సుప్రియాదేవి అంటున్నారు.

అన్యోన్య బంధం



పట్టణంలోని తులసీనగర్‌కు చెందిన ఆడారి శ్రీధర్(చిన్నా), రంగావారి వీధికి చెందిన చెక్కా పార్వతిలది ప్రేమ వివాహం. 25 ఏళ్ల క్రితం వీరిద్దరికీ స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ నేతగా ప్రజలకు సేవలందిస్తున్న శ్రీధర్ సామాజిక కార్యక్రమాల్లో భాగంగా గతంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వెళ్లినపుడు వీరిద్దరి మధ్య ప్రేమ చిగురించింది. శ్రీధర్ గతంలో యలమంచిలి జెడ్పీటీసీగా, ఎంపీటీసీగా పదవుల్లో పనిచేశారు. పార్వతి యలమంచిలి మున్సిపాలిటీలో 6వ వార్డు కౌన్సిలర్‌గా ప్రజాసేవ చేస్తున్నారు. వీరి ప్రేమ విషయం ఇంట్లో తెలిసిన తర్వాత వేర్వేరు కులాలు కావడంతో పార్వతి కుటుంబ సభ్యులు వీరి వివాహానికి ససేమిరా అన్నారు. తర్వాత వీరిద్దరూ వివాహం చేసుకున్నారు. వీరి ప్రేమకు గుర్తుగా కుమార్తె, కుమారుడు జన్మించారు. కుమార్తె ఎంబీఏ కోర్సు చేస్తుండగా, కుమారుడు బీటెక్ చదువుతున్నారు. 21 ఏళ్లుగా అన్యోన్యంగా జీవిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు ఈ దంపతులు.

ప్రేమలో గెలిచి..



యలమంచిలి కాకివాని వీధికి చెందిన పాస్టర్ కోసూరి బాలకృష్ణ పీటర్, భార్య భారతి ప్రిస్కిల్లా ఆరు నుంచి పదో తరగతి వరకు రాంబిల్లి మండలం లాలంకోడూరు హైస్కూల్‌లో చదువుకున్నారు. ఒకే తరగతికి చెందిన వీరి మధ్య ఏర్పడిన పరిచయం కాస్త ప్రేమగా మారింది. భారతిది అగ్రకులం కావడంతో వీరి ప్రేమ వ్యవహారాన్ని ఇంట్లోవారు ఒప్పుకోలేదు. అయినప్పటికీ 1985 మార్చి 14న వీరిద్దరూ విశాఖ వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించి వారి సహకారంతో వివాహం చేసుకున్నారు. బాలకృష్ణ పీటర్ స్వస్థలం రాంబిల్లి మండలం కొత్తపట్నం, భారతి ప్రిస్కిల్లాది అదే మండలం లాలంకోడూరు గ్రామం. వీరి వివాహం అప్పట్లో ఈ ప్రాంతంలో సంచలనం. వీరికి ఇద్దరు కుమారులు. కాకివానివీధిలో ఉంటున్న వీరి కుటుంబం.. అక్కడే ఓ క్రైస్తవ ప్రార్థనా మందిరం నిర్వహిస్తున్నారు. నమ్మకమైన బంధానికి ప్రతి రూపమే ప్రేమ అని, ఇది లేకుండా మనిషి సంఘజీవుడు కాలేడని చెబుతున్నారు ఈ దంపతులు. 35 ఏళ్లుగా తమ దాంపత్యం అన్యోన్యంగా సాగుతోందని, మా మధ్య ఏనాడూ భేదాభిప్రాయాలు రాలేదని వారంటున్నారు.

– యలమంచిలి రూరల్

వివాహాల ముందస్తు నమోదుకు పోలీసులు సహకరించాలి

- బాల్య వివాహాలను పూర్తిగా నివారించాలి
- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం



మాట్లాడుతున్న గొండు సీతారాం

తుమ్మపాల : బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఇంటా జరిగే వివాహాలపై దృష్టి పెట్టాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. పట్టణంలో పోలీస్ గెస్ట్‌హౌస్‌లో జిల్లా పోలీస్, సంబంధిత శాఖల అధికారులతో «బేటీ బచావో బేటీ పడావో» సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివాహాలకు సంబంధించి జనన ధ్రువీకరణ పత్రం, పదో తరగతి మార్క్ షీట్‌లను వివాహానికి ముందే పక్కాగా నమోదు జరిగేలా చూడాలన్నారు. 2022 జాతీయ ఆరోగ్య, కుటుంబ సర్వే 5ను దేశవ్యాప్తంగా 707 జిల్లాల్లో నిర్వహించగా, ఉమ్మడి విశాఖ జిల్లా 223 ర్యాంకు కలిగి, జాతీయ స్థాయిలో 25.4 శాతం సగటు రేటులో ఉన్నట్టు ధ్రువీకరించారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని వీటి నివారణకు సమరశంఖం పూరించాలన్నారు. వివాహాల్లో పాల్గొనకుండా వార్డు, గ్రామ స్థాయి కార్యకర్తల నుంచి అన్ని స్థాయిల నాయకులకు ఆదేశాలు జారీ చేయాలని ఇప్పటికే అన్ని జాతీయ, ప్రాంతీయ పార్టీల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులకు లేఖలు పంపించినట్టు తెలిపారు. ప్రతి బాల్య వివాహంపై స్థానిక రాజకీయ నాయకుల ఒత్తిళ్లు పట్టించుకోకుండా ఎఫ్ఐఆర్‌లు నమోదు జరిగేలా ఉత్తర్వులు జారీచేయాలని రాష్ట్ర పోలీసు డీజీపీకి సూచనలు చేశామన్నారు. ఐసీడీఎస్ పీడీ కె.అనంతలక్ష్మి మాట్లాడుతూ ప్రధానంగా బాల్యవివాహాలు నిలుపుదలలో అన్ని ప్రభుత్వ శాఖల శ్రమ, కృషి ఒక ఎత్తైతే, ఒక్క పోలీసు శాఖ అధికారుల చొరవ, ధైర్య సాహసాలు మరో ఎత్తని అన్నారు. దిశ పోలీసు స్టేషన్ డీఎస్పీ ఎం.ఉపేంద్రబాబు మాట్లాడుతూ జిల్లాలో అన్ని పోలీసు స్టేషన్లలో బాలల స్నేహపూర్వక వాతావరణం కలిగేలా కృషి చేస్తామన్నారు. బాల్య వివాహాలు, పోక్సో కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టి శతశాతం ఎఫ్ఐఆర్‌లు నమోదుకు కృషి చేస్తామన్నారు. జిల్లా ప్రొబేషనరీ అధికారి ఎం.శరత్‌బాబు, ఉమ్మడి జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు సూర్యనారాయణ, ఎన్‌హెచ్‌ఎం జిల్లా ప్రోగ్రాం మేనేజ్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ బి.లూసీ కార్డులియా, సీఐ, ఎస్ఐలు పాల్గొన్నారు.

15 రోజుల్లో చెరకు పేమెంట్లు ఇచ్చేందుకు చర్యలు

- గోవాడ సుగర్స్‌లో లక్ష టన్నుల క్రషింగ్ పూర్తి
- లక్ష్యం చేరుకునేందుకు చర్యలు : ఎండీ సన్యాసినాయుడు

చోడవరం: చెరకు రైతులకు అడిగిన వెంటనే కటింగ్ పర్మిట్లు ఇస్తున్నామని గోవాడ సుగర్స్ మేనేజింగ్ డైరెక్టర్ వి. సన్యాసినాయుడు మంగళవారం చెప్పారు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు లక్ష టన్నుల చెరకు క్రషింగ్ పూర్తి చేసిన సందర్భంగా ఆయన రైతులకు, కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఏడాది రెండు లక్షల టన్నుల చెరకు క్రషింగ్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటి వరకు లక్ష టన్నులు చేశామని, మిగతా లక్ష్యం పూర్తిచేయడానికి రైతులు, కార్మికులు పూర్తిస్థాయిలో సహకరించాలని ఆయన కోరారు. కటింగ్ పర్మిట్లు వచ్చిన రైతులకు సెల్ మెసేజ్ ద్వారా కూడా సమాచారం ఇస్తున్నామన్నారు. ఇప్పటి వరకు చెరకు సరఫరా చేసిన రైతులకు 15 రోజుల్లో పేమెంట్లు ఇచ్చేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఆ మొత్తాన్ని రైతుల ఖాతాల్లోకి జమ చేస్తామని ఎండీ చెప్పారు.

'ఇన్‌స్పైర్' అయ్యారు..

- 'ఇన్‌స్పైర్ మనక్'లో ప్రతిభ చూపిన విద్యార్థులు
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 200 ప్రాజెక్టుల ఎంపిక
- ఒక్కో విద్యార్థికి రూ.10 వేలు ప్రోత్సాహకం



ప్రయోగాలు చేస్తున్న సింహాచలం గురుకులం విద్యార్థులు (ఫైల్)

విశాఖ విద్య: ఇన్‌స్పైర్ మనక్ పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. కేంద్ర ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక విభాగం మంగళవారం ప్రకటించిన 'ఇన్‌స్పైర్ మనక్' పోటీల ఫలితాల్లో ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన 200 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఒక్కో విద్యార్థి రూ.10 వేలు ప్రోత్సాహకం అందుకోనున్నారు. ఆ మొత్తాన్ని వినియోగించుకుని, ప్రాజెక్టుకు అవసరమయ్యే సామగ్రిని సమకూర్చుకోవాల్సి ఉంటుంది. మినిస్ట్రీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతీ ఏటా పాఠశాల స్థాయిలో 'ఇన్‌స్పైర్ మనక్' పేరిట విద్యార్థుల్లో సృజనాత్మకతపై పోటీలను నిర్వహిస్తోంది. సామాజిక అంశాలు, సమాజాభివృద్ధికి దోహదపడే వినూత్నమైన ఆలోచనలకు రూపం ఇచ్చేలా ఎలాంటి ప్రాజెక్టులను తయారు చేస్తామనే అంశంపై విద్యార్థులు తమ ఐడియాను నమోదు చేయాల్సి ఉంటుంది. ఇలా ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 2023–24 విద్యా సంవత్సరానికి 2,680 మంది పేర్లు నమోదు చేసుకోగా, ఇందులో 200 మంది ఎంపికయ్యారు. ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించి, భావి శాస్త్రవేత్తలుగా తయారు చేయాలనే ప్రభుత్వ లక్ష్యం దిశగా సైన్సు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. రూ.10 వేలు ప్రోత్సాహకం కోసం విద్యార్థుల పేర్లుతో బ్యాంకు అకౌంట్ తెరవాలని విశాఖ జిల్లా సైన్సు అధికారి కె.ప్రసాద్ తెలిపారు.

రాష్ట్ర స్థాయి చెకుముకి పోటీల్లో తృతీయ స్థానం



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

మాడుగుల: పల్నాడు జిల్లా యడ్లపాడులో ఈ నెల 10, 11 తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి చెకుముకి పోటీల్లో మాడుగుల విద్యార్థినులు తృతీయ స్థానం సాధించారు. ఈ పోటీల్లో మాడుగుల జెడ్పీ హైస్కూలుకు చెందిన టి.హేమణ్య, కె. రక్షిత, వీరనారాయణం హైస్కూల్‌కు చెందిన ఆర్.హేమశ్రీ, ఆర్‌సీఎం హైస్కూల్‌కు చెందిన కె. శ్యామల పాల్గొని ప్రతిభ చాటారు. వీరిని బుధవారం స్థానిక వీనస్ కోచింగ్ కేంద్రం నిర్వాహకుడు తాళ్లపురెడ్డి నాగచంద్ర, ఉపాధ్యాయులు అభినందించారు.

కరాటేలో గిరి బాలికకు రజతం



తల్లిదండ్రులతో చిన్నారి తలుపులమ్మ

మాడుగుల: ఢిల్లీలో జరిగిన అండర్–14 జాతీయ స్థాయి కరాటే పోటీల్లో గిరి బాలిక రజతం సాధించింది. మాడుగుల మండలం మారుమూల గిరి గ్రామం పెద కూర్మానికి చెందిన ఎస్. తలుపులమ్మ ఈ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటింది. మంగళవారం పెదకూర్మంలో గ్రామస్తులు అభినందించారు.

గ్రామ స్వరాజ్య పాలన జగనన్నకే సాధ్యం



చింతపాకలో ఎంపీపీతో హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న విప్ ధర్మశ్రీ

- చింతపాకలో సచివాలయం, ఆర్బీకే, వెల్‌నెస్ కేంద్రాలను ప్రారంభించిన ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: జాతిపిత మహాత్మాగాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్య పాలన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమైందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. మండలంలోని చింతపాకలో కోట్లాది రూపాయలతో చేపట్టిన పలు అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రారంభోత్సవాలను మంగళవారం పండగ వాతావరణంలో నిర్వహించారు. రూ.42 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.21.80 లక్షలతో ఆర్బీకే, రూ.21 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ నూతన భవనాలను విప్ ధర్మశ్రీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ పాలన వలె కాకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఎన్నికల హామీల్లో 99 శాతం నెరవేర్చి చరిత్ర సృష్టించారన్నారు. గతంలో ఎప్పుడూ ప్రజల గురించి ఆలోచించని టీడీపీ నాయకులు ఎన్నికలు వస్తున్నాయని, దొడ్డి దారిలో గద్దె నెక్కడానికి ఇళ్లకు వచ్చి మాయ మాటలు చెబుతున్నారని, వారికి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. నీతిమంతమైన పాలన అందిస్తున్న సీఎంగా జగనన్నను, ఎమ్మెల్యేగా తనని రెండో సారి గెలిపించాలని కోరారు. గ్రామాభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు రూ.23 కోట్లు లబ్ధి చేకూర్చిన విప్ ధర్మశ్రీని నాయకులు సత్కరించారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, పార్టీ మండలాధ్యక్షుడు జోగా కొండబాబు, సర్పంచ్ గొలజాన శ్రీను, మాజీ ఎంపీటీసీ సంజీవరావు, నాయకులు నమ్మి అప్పలరాజు, కోరుకొండ అప్పలనాయుడు, ఇందలి కోటేశ్వరరావు, వీఆర్పీ నాయుడు, వజ్రపు బాబూరావు, శ్రీను, జీఈ ప్రభు పాల్గొన్నారు.

ఉపమాకలో అల్లరి నరేష్ సందడి



షూటింగ్ తిలకించేందుకు తరలివచ్చిన జనం

నక్కపల్లి: మండలంలో ఉపమాకలో షూటింగ్ సందడి నెలకొంది. హాస్యమూవీస్ బ్యానర్‌పై అల్లరి నరేష్ హీరోగా నిర్మిస్తున్న బచ్చలపల్లి సినిమా షూటింగ్ రెండో షెడ్యూల్ మంగళవారం ప్రారంభించారు. దర్శకుడు బి.సుబ్బు ఇక్కడ ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయ పరిసరాల్లో కొంతమంది నటీనటులకు సంబంధించిన సన్నివేశాలను చిత్రీకరించారు. షూటింగ్‌ను తిలకించేందుకు పరిసర ప్రాంత గ్రామాల యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చింది. గ్రామీణ వాతావరణం, తిరునాళ్లకు సంబంధించిన సన్నివేశాలను చిత్రీకరించారు. హీరో అల్లరి నరేష్ తదుపరి జరిగే షూటింగ్‌లో పాల్గొంటారని చిత్ర యూనిట్ తెలిపింది. దర్శకుడు సుబ్బు గతంలో సాయిధర్మతేజ హీరోగా సోలో బతుకే సో బెటర్ సినిమాకు దర్శకత్వం వహించారు.

మురిసిన క్రీడాలోకం



విజయోత్సాహంలో క్రీడాకారిణులు

- ఆడుదాం ఆంధ్రాపై క్రీడాకారుల ఆనందం

మధురవాడ: ఆడుదాం ఆంధ్రా పోటీలతో క్రీడాలోకం మురిసిపోతోంది. ప్రతిభ ఉండి ప్రోత్సాహం లేక..సరైన వేదిక లభించక నిస్తేజంలో ఉన్న మట్టిలో మాణిక్యాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా నిలిచింది. భుజంతట్టి ప్రోత్సహించింది. ఆడుదాం ఆంధ్రా వంటి మహాయజ్ఞం చేపట్టింది. రండి ఆడండి..ప్రతిభ చాటుకోండి..జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగండి అని పిలుపునిచ్చింది. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి ఊహించని విధంగా నగదు బహుమతులతో ఉత్సాహపరిచింది. దీంతో ప్రభుత్వానికి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి క్రీడాలోకం జేజేలు పలికింది. వివిధ జిల్లాల క్రీడాకారులు తమ మనోగతం ఇలా వెల్లడించారు.

ఇంతలా ప్రోత్సహించిన సీఎంను చూడలేదు



ఆడుదాం ఆంధ్రా పేరుతో క్రీడాకారులను ఏ ముఖ్యమంత్రి ఇంతలా ప్రోత్సహించలేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడాకారులకు అండగా నిలిచి ప్రోత్సహించారు. పోటీలు నిర్వహించడమే కాదు..ఏ లోటూ లేకుండా చూసుకున్నారు. వైఎస్సార్ కడప జిల్లా, ప్రొద్దుటూరు మండలం, టైట్ పాలెం గ్రామ సచివాలయం నుంచి క్రికెట్ ఆడేందుకు వచ్చాం. 3వ స్థానంలో నిలిచాం.

– మహబూబ్ షరీఫ్, క్రికెట్ క్రీడాకారుడు

ప్రైజ్ మనీ అకౌంట్లలో వేయడం మంచి ఆలోచన



మహిళలు బయటకు రావడం చాలా కష్టంతో కూడుకున్న పని. వారికి అన్ని రకాలుగా రక్షణ కల్పించడమే కాదు. అన్ని సదుపాయాలు కల్పించారు. ఇంత అద్భుతంగా పోటీలు నిర్వహించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు. ప్రైజ్ మనీ కూడా నేరుగా క్రీడాకారుల అకౌంట్లలో వెయ్యడం చాలా మంచి ఆలోచన. ఖోఖోలో 2వ ప్రైజ్ గెలుచుకున్నాను.

– గుడివాడ, కృష్ణా జిల్లా

ఏర్పాట్లు అద్భుతం



ఏర్పాట్లు ఎక్కడా ఏవిధమైన లోటు లేదు. భోజనం, వసతి అద్భుతంగా ఏర్పాటు చేశారు. సచివాలయ స్థాయి నుంచి పోటీలు పెట్టినప్పుడు, నాన్ మెడలిస్ట్‌లకే పోటీలు పెట్టి ఉంటే బాగుండేది. మరింత ప్రయోజనం ఉండేది. మేము బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు కడప జిల్లా నుంచి వచ్చాం. ప్రైజ్ కూడా గెలుచుకున్నాం.

–వెన్నెలశ్రీ, జి. శ్రీలత

ప్రతిభ చాటుకునే అవకాశం



పెళ్లైన అయిన తర్వాత కూడా ఆడుదాం ఆంధ్రా పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు. స్కూల్ టైంలో టెన్నీ కాయిట్, బాల్ బ్యాడ్మింటన్ నేషనల్స్‌లో ఆడాను. పెళ్లి తర్వాత అవన్నీ ఒదిలేశాను. ఆడుదాం ఆంధ్రా పోటీలు నాలాంటి వారికి ఎంతో ఉత్తేజాన్ని, ఆనందాన్ని ఇచ్చాయి. నా టాలెంట్ మళ్లీ ప్రూవ్ చేసుకున్నాను. స్టేట్ లెవెల్‌లో క్రికెట్‌లో 3వ బహుమతి గెలుకున్నాము. మహిళలు అందరి తరఫున జగనన్నకు కృతజ్ఞతలు.

– బుదగుంట్ల స్వప్న, క్రికెట్ క్రీడాకారిణి, ప్రకాశం జిల్లా

క్లుప్తంగా

16న జాబ్‌మేళా

అనకాపల్లి : నర్సీపట్నం ఎంఎల్‌ఏఎస్ డిగ్రీ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 16న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి టి.చాముండేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేళాకు 18 నుంచి 35 సంవత్సరాల్లోపు, పది తరగతి నుంచి పీజీ వరకు విద్యనభ్యసించి అభ్యర్థులు అర్హులని ఆయన తెలిపారు.

వ్యవసాయ సూచనలు పాటించాలి

కశింకోట : వ్యవసాయ అధికారులు అందించే సలహాలు, సూచనలు ఎప్పటికప్పుడు పాటించి రైతులు పంటలు పండించడం వల్ల అధిక దిగుబడులను సాధించవచ్చునని మండల వ్యవసాయ అధికారి ఎం.స్వప్న అన్నారు. కశింకోట, వెదురుపర్తి గ్రామాల వద్ద మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో క్షేత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. వరి, చెరకు, తదితర పంటలు, ఎరువుల వాడకంపై సూచనలిచ్చారు. వ్యవసాయ అధికారుల సలహాలు పాటించి పంటలు సాగు చేయడం వల్ల వరి పంట కోత ప్రయోగాల్లో ఎక్కువ దిగుబడులు వచ్చాయన్నారు. ఏఈవో ఎ.శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు 82వ వార్డులో 'జగనన్న సురక్ష'

అనకాపల్లి : స్థానిక 82వవార్డు పరిధి సచివాలయం-4 ఉడ్‌పేట ప్రాథమిక పాఠశాల ఆవరణలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని వార్డు పరిధిలో ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఏలేరు కాల్వ బ్రిడ్జి వద్ద చెత్తాచెదారం తొలగించాలి

అనకాపల్లి : జీవీఎంసీ విలీన గ్రామమైన కొప్పాక ఏలేరు కాలువ బ్రిడ్జికిరువైపులా ఉన్న చెత్తను తొలగించి రోడ్డు ప్రమాదాలు జరగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని స్థానికులు నడిగట్ల అప్పారావు, తాతారావులు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వినాయక, దుర్గాదేవి, పలు దేవతల పండగల్లో మట్టి విగ్రహాలను కాలువలో నిమ్మజ్జనం చేసినందున కాలువబ్రిడ్జికి ఇరువైపులా చెత్తా చెదారం పేరుకుపోయిందని వారు తెలిపారు. ఈ సమస్యపై జీవీఎంసీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని వారు కోరారు.

బెల్లం ధరలు

అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 7,847 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,900	4,700
మొదటి రకం	3,510	4,070
రెండో రకం	3,480	3,690
మూడోరకం	3,270	3,470

అనకాపల్లి సినిమాలు

ఈగల్	: రాజా
అంబాజీపేట	
మ్యారేజిబ్యాండు	: సత్యనారాయణస్క్రీన్-1
ఈగల్	: సత్యనారాయణస్క్రీన్-2
యాత్ర-2	: షిర్డిసాయి
లాల్‌సలామ్	: పర్తిసాయి
గేమ్ ఆన్	: వెంకటేశ్వర
నా సామిరంగ	: శ్రీసత్య
హనుమాన్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 17 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-3 యూనిట్లు, ఓ పాజిటివ్-7 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు, ఎ నెగిటివ్-1 యూనిట్, ఓ నెగిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 368 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 346 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

పట్టణ పాఠశాల..డిజిటల్ బాట

- అంగన్‌వాడీ నుంచి 10వ తరగతి వరకు ఒకే దగ్గర
- భీమునిగుమ్మం పాఠశాలకు రూ.4 కోట్లు
- నూతన భవనాలు, మౌలిక సౌకర్యాలతో తరగతి గదులు


పూర్తి సౌకర్యాలతో నిర్మించిన నూతన భవనం


తరగతి గదిల్లో విద్యార్థుల బీరువాలు, పాఠాలకు పేనల్ బోర్డు

తుమ్మపాల : పట్టణాల్లో పెట్టుబడులను ఏకీకృతం చేసి అభివృద్ధికి బాటలు వేయడానికి కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్మార్ట్ మిషనే 'సీటీస్'. ఇది పట్టణ గృహ నిర్మాణ శాఖ, అర్బన్ అఫైర్స్, పలు ఏజెన్సీల ఉమ్మడి కార్యక్రమం. పట్టణాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పనే లక్ష్యంగా సీటీస్ పనిచేస్తుంది. దీనిలో భాగంగా జీవీఎంసీలో అంతర్భాగమై 83 వ వార్డులో ఉన్న డాక్టర్ బీఆర్.అంబెద్కర్ మున్సిపల్ పాఠశాల అభివృద్ధికి సీటీస్ ద్వారా జీవీఎంసీ రూ.4 కోట్ల నిధులను వెచ్చించింది. జీవీఎంసీ అనకాపల్లి జోన్ పరిధిలో 6 పాఠశాలలు ఉన్నప్పటికి అత్యధిక నిధులు వెచ్చించి ఈ పాఠశాలలో మౌలిక సౌకర్యాలు కల్పిస్తూ మరింత అభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

అంగన్‌వాడీ నుంచి 10వ తరగతికి అప్‌గ్రేడ్.....

పాఠశాలలో సుమారు పది సెంట్ల స్థలంలో ఐదు తరగతి గదులు, అంగన్‌వాడీ కేంద్రంతో రెండంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నారు. దాదాపు పూర్తయిన ఈ భవనం అతి త్వరలో ప్రారంభం కానుంది. ఇంత వరకు 6 నుంచి 10వ తరగతి వరకు మాత్రమే ఉండే భీముని గుమ్మం రానున్న విద్యా సంవత్సరం నాటికి అంగన్‌వాడీ, ఎల్‌కేజీ, యూకేజీ, 1 నుంచి 5 తరగతుల నిర్వహణకు చర్యలు చేపడుతున్నారు. దీంతో పట్టణంలో మరెక్కడా లేనివిధంగా అన్ని వసతులతో అంగన్‌వాడీ నుంచి 10 వ తరగతి వరకు గల ఏకైక పాఠశాల కానుంది.

విద్యార్థుల సౌకర్యాలకే అధిక ప్రాధాన్యం

పాఠశాలలో 6 నుంచి 10 వ తరగతి వరకు దాదాపు 90 మంది విద్యార్థులు వివిధ తరగతుల్లో చదువుకుంటున్నారు. బీసీ, ఎస్సీ వర్గాల పిల్లలే ఇక్కడ అధికంగా చదువుతున్నారు.

పట్టణ పేదరిక నిర్మూలనలో భాగంగా ప్రతి విద్యార్థికి పాఠశాలలోనే మెరుగైన వసతులు కల్పించారు. తరగతి గదుల్లో పేనల్ బోర్డ్స్ ఏర్పాటు చేశారు. ప్రతి విద్యార్థికి లాకర్‌తో కూడిన బీరువాలు కూడా ఉన్నాయి. ప్రతి తరగతి గదిలో ప్రొజెక్టర్‌లు అందుబాటులో ఉండడం వల్ల గ్లోబల్ ఎడ్యుకేషన్ అందించడం సులభతరంగా ఉందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. పాఠ్యపుస్తకాలతో పాటు నోట్ పుస్తకాలను కూడా ప్రభుత్వమే అందిస్తుంది. విద్యార్థుల హాజరు శాతం కూడా శతశాతం ఉంటుంది.

మా క్లాస్‌లో అన్ని సౌకర్యాలు ఉన్నాయి



నాపేరు కోడి దుర్గామహి, కొట్నీ వీధి నుంచి వస్తున్నాను. 10వ తరగతి చదువుతున్నాను. మా క్లాస్‌లో బ్లాక్ బోర్డుకు బదులు పేనల్ బోర్డు ద్వారా టీచర్ మాకు పాఠాలు బోధిస్తున్నారు. దీంతో మాకు మరింత ఆసక్తి కలుగుతుంది. బీరువాలు ఏర్పాటు చేసి ఒక్కో విద్యార్థికి లాకర్లు ఇచ్చారు. కూర్చునేందుకు పాత బెంచీల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేశారు. చదువుకునేందుకు అన్ని వసతులు ఉన్నాయి. పదో తరగతి కావడంతో సాయంత్రం కూడా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. –కోడి దుర్గా, 10వ తరగతి

మాది డిజిటల్ క్లాస్‌రూం



నా పేరు కె.గీతికా, 9వ తరగతి చదువుతున్నాను. భీముని గుమ్మం నుంచి వస్తున్నాను. మా పాఠశాలలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. గతంలో పాఠశాలలో సరైన సౌకర్యాలు లేక పాఠశాలకు అయిష్టంగా వచ్చేదాన్ని. కానీ ఇప్పుడు అన్ని వసతులు ఉన్నాయి. పాఠశాలకు వచ్చినప్పటి నుంచి మాకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉంది. రోజు పాఠశాలకు వస్తున్నాము. మా తరగతి గది ఇప్పుడు డిజటల్ క్లాస్ రూమ్. ట్యాబ్‌లతో పాటు డిజిటల్ బోర్డులు ఉండడంతో పాఠాల్లో సందేహాలు నివృత్తి చేసుకోగలుగుతున్నాం. –కె.గీతికా, 9వ తరగతి

ఆదర్శంగా కశింకోట గ్రామాభివృద్ధి


డ్రైనేజి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బుల్లిబాబు

కశింకోట : కశింకోట గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు అన్నారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సహకారంతో అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. జాతీయ రహదారి నుంచి నిర్మిస్తున్న డ్రైనేజిని రూ.25 లక్షలు మంత్రి సమకూర్చిన నిధులతో శారదానదితో అనుసంధానిస్తామన్నారు. పలుచోట్ల గ్రామంలో సిమెంట్ రోడ్లు, మురికి కాలువలను నిర్మిస్తున్నామన్నారు. ఈ పనులను పర్యవేక్షించారు. పంచాయతీ కార్యాలయంలో గ్రామ వలంటీర్లతో సమావేశమయ్యారు. పంచాయతీ కార్యదర్శి రమేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు లెర్నింగ్ మెటీరియల్ పంపిణీ


కశింకోట డీపీఎన్ జెడ్పీ హైస్కూలులో నాంది కంప్యూటర్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు మెటీరియల్ అందజేసిన దృశ్యం

కశింకోట: కశింకోటలోని డీపీఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నానహి కాళీ ప్రాజెక్టు (నాంది)లో కంప్యూటర్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు మహేంద్ర రైజ్ సంస్థ సహకారంతో లెర్నింగ్ మెటీరియల్ మంగళవారం అందజేశారు. హెచ్ఎం ఎంఆర్‌వీ అప్పారావు చేతుల మీదుగా బ్యాగు, పుస్తకాలు, పెన్నులు, ప్యాడ్, కలర్ పెన్సిళ్లు, రెయిన్ కోట్ వగైరా మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో కమ్యూనిటీ అసోసియేట్ టీచర్స్ డి.దుర్గాభవాని, పి.మాధురి, కె. స్వామి, పాఠశాల ఉపాధ్యాయులు ఆచంట రవి, వి. ప్రభాకరరావు, అప్పారావు, ఆనంద్, ప్రసాద్, వార్డెన్ నారాయణ రావు పాల్గొన్నారు.

బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న బొడ్డేడ ప్రసాద్


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి : రానున్న సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకొని గవరపాలెం 80, 81 వార్డుల పరిధిలో బూత్ స్థాయి కార్యకర్తల సమావేశాన్ని స్థానిక రింగ్ రోడ్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ మాట్లాడుతూ బూత్ స్థాయి నుంచి కార్యకర్తలను బలోపేతం చేయడంతో పాటు ఆయా ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని వారు కోరారు. ప్రతి కార్యకర్త, బూత్ లెవెల్ కార్యకర్తలు రానున్న ఎన్నికల్లో ఒక సైనికుడిలా పని చేసి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ 80వ వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కర్, పలు ఆలయాల చైర్మన్లు కొణతాల మురళీకృష్ణ, కె.ఎం.నాయుడు, పార్టీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు -2 వేగి త్రినాథ్ పాల్గొన్నారు.

రథ సప్తమి వేడుకల పోస్టర్ ఆవిష్కరణ

సుంకరమెట్ట సూర్యనారాయణస్వామి ఆలయంలో ఈనెల 16న జరిగే రథ సప్తమి వేడుకల పోస్టర్‌ను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ఆవిష్కరించారు. ఈనెల 16న జరిగే రథసప్తమి వేడుకల్లో భక్తులకు అసౌకర్యం ఏర్పడకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఈనెల 20న భీష్మ ఏకాదశి సందర్భంగా స్వామి వారికి సామూహిక వత్రాలు నిర్వహిస్తున్నామన్నారు. 81వ వార్డు పీలా రాంబాబు గృహంలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతకుముందు తుమ్మపాల మరిడిమాంబ అమ్మవారిని దర్శించుకొన్నారు. ఆలయ అభివృద్ధికి రూ.50వేలు కమిటీ సభ్యులకు అందజేశారు. ఏపీ ఐడబ్ల్యూఏ చైర్మన్ దిలీప్‌కుమార్, రాష్ట్ర వైద్య విభాగం ప్రధాన కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనర్సింహారావు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ శివ, పట్టణ ప్రధాన కార్యదర్శి దాడి నారాయణరావు, సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, మండల ప్రధాన కార్యదర్శి శివసూరి, ఆయా ఆలయాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రిక్షా కార్మికులను ఆదుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న మాణిక్యాలరావు

అనకాపల్లి : సంఘ సభ్యుల ఐక్యతతోనే హక్కులు సాధ్యమవుతాయని రిక్షా కార్మిక సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ సూదికొండ మాణిక్యాలరావు అన్నారు. స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానంలో మంగళవారం కార్మిక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు రూ.లక్షలు విలువ చేసే ఆటోలు, టాక్సీలు నడిపేవారికి ఆర్థికభరోసా కల్పిస్తూ రిక్షా కార్మికులకు ఎటువంటి ఆర్థిక భరోసా కల్పించకపోవడం అన్యాయమన్నారు. కార్మికుల న్యాయమైన కోర్కెల సాధన కోసం కృషి చేసే ప్రభుత్వాలకు కార్మికుల మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని చెప్పారు. కార్మికుల ఆరోగ్య, ఆర్థిక పరిస్థితి రీత్యా వృద్ధాప్య పింఛన్ అందించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కార్మికులకు వయోపరిమితి 45 సంవత్సరాలకు చేయాలన్నారు. సొంత రిక్షా లేని నిరుపేద కార్మికులకు ప్రభుత్వం ఉచితంగా రిక్షాలు పంపిణీ చేయాలన్నారు.

కార్మికులందరికీ గృహాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఐక్యసంఘాల నేతలు గురుంపల్లి వెంకటరావు, జగ్గారావు, డేవిడ్ అప్పారావు, నీలకంఠం కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా విజయ వినాయక ఆలయ వార్షికోత్సవం



తుమ్మపాల : విజయరామరాజుపేట విజయ వినాయకస్వామి వారి ఆలయ తృతీయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. తెల్లవారు నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి గణపతిని పూజించి మొక్కులు తీర్చుకున్నారు. 1008 మోదకములతో గణపతి హోమం, పంచామృతాభిషేకం, ఆలయ సంప్రోక్షణ, బిళ్వదల సహస్ర నామార్చన పూజలను అర్చకులు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్నసమారాధన జరిగింది. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

8మందికి ఉచిత నేత్ర చికిత్సలు


రోగులతో ఆస్పత్రి యాజమాన్యం

అనకాపల్లి : స్థానిక రోటరీ కంటి ఆస్పత్రిలో 8 మందికి మంగళవారం నేత్ర శస్త్రచికిత్సలు నిర్వహించినట్టు వైద్యుడు కె.మల్లీశ్వరరావు చెప్పారు. ఈనెల 12న ఆస్పత్రిలో జరిగిన నేత్ర వైద్యశిబిరానికి 29 మంది హాజరుకాగా వారిని పరీక్షించగా 8 మంది ఆపరేషన్లకు ఎంపికయ్యారని ఆయన తెలిపారు. రోగులకు ఉచితంగా మందులు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ చైర్మన్ రవిరాం జవహర్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ సారథి జగనన్నకు మళ్లీ పట్టం కట్టాలి


తీడలో ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్

కశింకోట : దేశంలో ఎక్కడా లేని విధంగా అనేక సంక్షేమ పథకాలను అందిస్తూ ప్రజల హృదయాల్లో నిలిచిపోయిన వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడానికి ప్రతి ఒక్కరూ మద్దతు పలకాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ కోరారు. మండలంలోని ఈ.చౌడువాడ, తీడ, జి.భీమవరం సచివాలయాలను సందర్శించి అక్కడి పార్టీ శ్రేణులు, ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు భరోసా, అమ్మ ఒడి, రూ.3 వేలకు అవ్వా తాతలు, వితంతువుల పింఛన్ పెంపు, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, నేతన్న నేస్తం, జగనన్న విద్యా దీవెన , పేదలకు ఇళ్ల మంజూరు తదితర అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. అందరికీ ఆరోగ్యాన్ని అందించడానికి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం తదితర వాటిని అమలు చేస్తున్నారున్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి పంటల దిగుబడి పెంపుదలకు దోహదంగా నిలిచారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీలు, సామాజిక భవనాలు వగైరా అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు. వీటిపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసి పార్టీ బలోపేతానికి శ్రేణులు కృషి చేయాలన్నారు. గ్రామ వలంటీర్లు తమ పరిధిలో ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వచ్చి పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా శ్రేణులు పని చేయాలన్నారు. ఇంటింటికి వెళ్లి వైఎస్సార్ ప్రభుత్వం చేపట్టిన పథకాలను వివరించి పార్టీకి విజయం చేకూర్చడానికి దోహదపడాలన్నారు. సర్పంచ్‌లు శివ, వెంకట్, చిరికి సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ శ్రేణులు, మహిళలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

అనకాపల్లి: ప్రమాదవశాత్తూ ఇంట్లో జారిపడిన వీసం వరలక్ష్మి(54) కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పట్టణ పోలీస్‌లకు మంగళవారం ఫిర్యాదు అందింది. పట్టణ ఏఎస్‌ఐ మణికుమారి వివరాల మేరకు... స్థానిక కోట్నీవీధికి చెందిన వరలక్ష్మి ఈనెల 3న ఇంట్లో మేడపై నుంచి కిందకు దిగుతూ జారిపడిపోవడంతో తలకు తీవ్ర గాయమైంది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు ఆమె భర్త రాంబాబు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

అచ్యుతాపురం: కీలకమైన సెజ్ వాహనాలు రాకపోకలు సాగించే అచ్యుతాపురం కూడలిలో నడిపే ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అచ్యుతాపురం సీఐ బుచ్చిరాజు సూచించారు. అచ్యుతాపురంలో మంగళవారం ఆటో యూనియన్ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ మోటార్ వాహన చట్టం గురించి వివరించారు. లైసెన్స్, ఇన్సూరెన్స్, ప్రయాణికుల పరిమితి, వేగం వంటి అంశాలపై నిబంధనలు పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ యూనియన్ల ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

బ్రాండిక్స్ డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి

వేలాది మంది బ్రాండిక్స్ ఉద్యోగుల రక్షణ బ్రాండిక్స్ వాహనాల డ్రైవర్లపైనే ఆధారపడి ఉందని అచ్యుతాపురం సీఐ బుచ్చిరాజు అన్నారు. అచ్యుతాపురంలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు.పగలు, రాత్రి షిఫ్ట్‌లలో బ్రాండిక్స్ బస్సులను నడిపే డ్రైవర్లు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వేగ నియంత్రణ పాటించాలని సూచించారు.

భారీ వాహనాల రాకపోకలకు చెక్


రహదారిలో పొక్లెయిన్ సహాయంతో ఇనుప స్తంభం ఏర్పాటు చేస్తున్న ఆర్‌అండ్‌బీ సిబ్బంది

అనకాపల్లి: అనకాపల్లి – అచ్యుతాపురం రహదారిలో భారీ వాహనాల రాకపోకలకు ఇనుప స్తంభాలతో చెక్ పెట్టారు. రహదారి శిథిలావస్థపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆందోళనకు ఎమ్మెల్యే రమణమూర్తిరాజు సహాయ సహకారాలతో ఈ ఇనుప స్తంభాలను ఏర్పాటు చేయడం జరిగిందని ఆర్‌అండ్‌బీ జేఈ వేణుగోపాల్ అన్నారు. అనకాపల్లి – అచ్యుతాపురం రహదారి ఇనుపస్తంభాల ఏర్పాటుతో రహదారి శిథిలం కాకుండా కాపాడవచ్చని ఆయన చెప్పారు.

ఉపాధ్యాయిని మెడలో పుస్తెలతాడు చోరీ

అనకాపల్లి: ఉపాధ్యాయిని మెడలో నుంచి మూడు తులాల బంగారు పుస్తెలతాడు చోరీకి గురైనట్లు పట్టణ పోలీస్‌లకు మంగళవారం ఫిర్యాదు అందింది. ఎస్‌ఐ మహ్మద్ ఆలీ వివరాల మేరకు... మండలంలో తుమ్మపాలకు చెందిన రాపేటి సరస్వతి గవరపాలెం ఎలిమెంటరీ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయినిగా పని చేస్తోంది.

ఈ నెల 12న సాయంత్రం 5 గంటల సమయంలో తన భర్త చదరం శ్రీనివాసరావుతో కలిసి ద్విచక్రవాహనంపై పూల్‌బాగ్ రోడ్డులో తుమ్మపాల వెళ్తుండగా, గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి ఆమె మెడలో పుస్తెలతాడు తెంచుకుని ఉడాయించారు. శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రేపటి నుంచి మరిడిమాంబ జాతర మహోత్సవాలు

అనకాపల్లి: విజయరామరాజుపేట మరిడిమాంబ అమ్మవారి 8వ వార్షికోత్సవాలను పురస్కరించుకొని ఈనెల 15వ తేదీ రాత్రి అమ్మవారి జాతర మహోత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ ప్రధాన కార్యదర్శి పలకా రాము, చైర్మన్ ఆళ్ల శివ రామసత్యనారాయణ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 22న రాత్రి 7 గంటలకు అమ్మవారి జాతర జరుగుతుందని, అదేరోజు తెల్లవారుజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, సాయంత్రం అమ్మవారి ప్రతిమ ఊరేగింపు, రాత్రి సాంస్కృతిక, నేలవేషాలు కార్యక్రమాలు చేపడుతున్నట్టు వారు తెలిపారు.

నేడు స్వామివారి కల్యాణోత్సవం

అనకాపల్లి: జీవీఎంసీ విలీన గ్రామమైన రాజుపాలెం సూర్యనారాయణస్వామి ఆలయంలో బుధవారం రాత్రి 7 గంటలకు స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్నట్టు ఆలయ చైర్మన్ కొణతాల బాబూరావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అంతకుముందు సాయంత్రం 3 గంటలకు సారె ఊరేగింపు జరుగుతుందన్నారు.